సాక్షి
జయశంకర్ భూపాలపల్లి



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

మంత్రి ప్రత్యేక పూజలు



కాటారం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంతో పాటు ఎర్రగుంటపల్లి, ధన్వాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల వద్ద రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను దర్శించుకొని పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ అర్చనలు చేసి అమ్మవారి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు

భూపాలపల్లి రూరల్: జిల్లా ప్రజలకు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆనందం, ఆరోగ్యం నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం వెల్లివిరియాలని కోరుకున్నారు.

54 శాతం బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ బొగ్గు గనులలో సెప్టెంబర్ నెలలో 54 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏరియాలోని గనుల్లో 3.17 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా 1.71 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించినట్లు తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఓపెన్ కాస్ట్‌లో ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలగడంతో ఉత్పత్తి వెనుకబడిపోయినట్లు కనిపిస్తుందని తెలిపారు. అక్టోబర్ నెలలో 4.23 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌ను విధించినట్లు చెప్పారు. బొగ్గు ఉత్పత్తికి సింగరేణి కార్మికులు సహకరించాలని కోరారు. ఉద్యోగులందరూ రక్షణ సూత్రాలు పాటించాలని, రక్షణ విషయంలో యాజమాన్యం రాజీపడేది లేదన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కాటారం(మహాముత్తారం): మహాముత్తారం మండలం కోనంపేట శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై బుధవారం ఎస్సై-2 మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి జరిపినట్లు ఎస్సై-2 మహేశ్ తెలిపారు. ఘటనా స్థలంలో కోడిపందేలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.13,300 నగదు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. మహాముత్తారానికి చెందిన రవి, రాజేందర్, రాజేశ్, నిఖిల్, రవి, రమేశ్, శ్రీకాంత్, నాగారం గ్రామానికి చెందిన పక్రుద్దీన్, రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. ప్రజలు దసరా పండుగ ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

రామప్పలో ఇంగ్లండ్ దేశస్తుడు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని ఇంగ్లండ్‌కు చెందిన పర్యాటకుడు నికోలస్ సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయనకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ శిల్పకళ విశిష్టతను గైడ్ విజయ్ కుమార్ వివరించారు. అనంతరం నికోలస్ లక్ష్మీదేవిపేటలో దసరా క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీలను వీక్షించారు. అమరావతి విద్యాలయం మైదానంలో జరిగిన ఫైనల్ పోటీల్లో పట్వారిపల్లి, నర్సింగాపూర్ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలలో లక్ష్మీపురం ప్రథమ బహుమతి, నర్సింగాపూర్ ద్వితీయ బహుమతి, బూర్గుపేట తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. కబడ్డీ పోటీలు అద్భుతంగా జరిగాయని, క్రీడాకారులు బాగా రాణించారని నికోలస్ ప్రశంసించారు. నర్సింగాపూర్‌కు చెందిన తన మిత్రుడి ఇంటికి వచ్చిన సందర్భంలో నికోలస్‌తో పలువురు గ్రామస్తులు, క్రీడాకారులు ఫొటోలు దిగారు.

నీటమునిగిన పంటల పరిశీలన

కన్నాయిగూడెం: గోదావరి వరదతో నీట మునిగి దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారి మహేశ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని గూర్రేవుల, సింగారం, బుట్టాయిగూడెం, చింతగూడెంతో పాటు ఇతర గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించినట్లు తెలిపారు.

నాలుగు కత్తులు కలిస్తేనే దసరా!

గీసుకొండ: ఆ గ్రామంలో నాలుగు కత్తులు ఒక చోట కలిస్తేనే దసరా. ఈ ఆచారం సంవత్సరాలుగా కొనసాగుతోంది. గ్రేటర్ 16వ డివిజన్ ధర్మారంలో 4 కుటుంబాలకు చెందిన 4 కత్తులను గ్రామంలోని 'కచ్చీర్'కు తీసుకుని వచ్చి దసరా ఉత్సవాలను నిర్వహించడం ఆచారంగా వస్తోంది. గంగుల వీరయ్య కుటుంబం నుంచి ఒకటి, కొట్టె లక్ష్మయ్య కుటుంబం నుంచి ఒకటి, పోలెబోయిన వారి కుటుంబాల నుంచి రెండు కత్తులకు పూజలు చేసి ఇళ్ల నుంచి మందీ మార్బలంతో అట్టహాసంగా తీసుకుని వెళ్తారు. ఆ తర్వాత ఆయుధ పూజ చేసి కత్తుల(ఆయుధాల)తో సోరకాయను కట్‌చేసి కంకణాలు కట్టి దసరా పండుగను జరుపుకుంటారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.



ఉత్సవాలకు వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

జాతీయ జెండాల ఆవిష్కరణ

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల, వనపర్తి గ్రామాల్లో దసరా ఉత్సవాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించడం ప్రత్యేకం. నెల్లుట్లలో పంచాయతీ కార్యాలయ సమీపంలోని బురుజుపై ఆనవాయితీగా జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. పూర్వం పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్న కాలంలో మాల్‌పటేల్ అనే వ్యక్తి విజయానికి సూచికగా దసరా పండుగకు జాతీయ జెండా ఎగురవేశారు. అది నేటికీ కొనసాగిస్తూ ప్రస్తుతం చిట్ల వంశానికి చెందిన వారు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. వనపర్తిలో బొడ్రాయి వద్ద ఒక రాతి స్తంభానికి జెండాను కట్టి స్థానికులు ఎగుర వేస్తారు. కొన్నేళ్లుగా ఆయా గ్రామాల పెద్దలు ఉదయమే అక్కడికి వచ్చి జెండాలను ఆవిష్కరించిన అనంతరం సాయంత్రం దసరా వేడుకలు నిర్వహిస్తారు.



జెండాను ఆవిష్కరించనున్న స్థలం

మద్యం, మాంసం ముట్టరు

దుగ్గొండి: దసరా అంటే మద్యం, మాంసం. ఇదే సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనూ బొడ్రాయి వద్ద గొర్రెపిల్లను బలిచ్చే ఆనవాయితీ ఉంది. కానీ, మైసంపల్లి గ్రామంలో 50 ఏళ్లుగా ఆర్య సమాజ్ పద్ధతిలో దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులంతా బొడ్రాయి వద్ద చలువ పందిళ్ల కింద సామూహిక హోమాలు చేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమం చేసి సాయంత్రం ఇంట్లో కుటుంబ సభ్యులంతా నిష్టగా ఉండి నేలపై పడుకుంటారు. ఆ రోజు మద్యం, మాంసం ఆ ఊరిలో నిషేధం. కనీసం ఇంట్లో మద్యం బాటిల్ కూడా ఉండనివ్వరు. కాగా, చుట్టుపక్క గ్రామాల ప్రజలు వేడుకలు చూసేందుకు వందల సంఖ్యలో తరలివస్తారు.

నిష్టగా ఉంటారు..



మా గ్రామంలో చాలా సంవత్సరాలుగా ఆర్యసమాజ్ పద్ధతిలో దసరా జరుగుతోంది. అన్ని గ్రామాల్లో మద్యం, మాంసం ఏరులై పారినా మా గ్రామస్తులు దసరా పండుగ రోజున నిష్టగా ఉంటారు. కుల దైవాలు, ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేస్తారు. అందరూ కలిసి ఒక్కచోట చేరి హోమాలు నిర్వహిస్తాం. గ్రామం అంతా ఒక్కచోటికి వచ్చిన తరుణం చాలా సంతోషంగా ఉంటుంది. ఐకమత్యానికి అద్దం పడుతుంది.

– వేముల ఇంద్రదేవ్, గ్రామస్తుడు

వినూత్నం.. విజయదశమి

ప్రత్యేకంగా వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు

- మద్యం, మాంసాహారానికి పలువురు దూరం
- ఉమ్మడి జిల్లాలో నేడు దసరా ఉత్సవాలు


చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి (దసరా)ని జరుపుకుంటారు. తొమ్మిది రోజులపాటు దుర్గాదేవిని వివిధ రూపాల్లో కొలిచిన అనంతరం ఈరోజు విశిష్ట పూజలు చేస్తారు. అయితే, ఈసారి దసరా, గాంధీ జయంతి (అహింసా దినోత్సవం) ఒకేరోజు రావడంతో ఉమ్మడి జిల్లాలో పలువురు మద్యం, మాంసానికి దూరంగా ఉండాలని తీర్మానించారు. పలు ప్రాంతాల్లో వినూత్నంగా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పులివేషధారణ, కత్తిసాము, విన్యాసాలు, పిట్టల దొర, బొమ్మల కొలువులు ఇలా ఎన్నోరకాలుగా పల్లెలు, పట్టణాల్లో సందడి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేడు (గురువారం) వినూత్నంగా నిర్వహించనున్న దసరా వేడుకలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

దేశభక్తికి చిహ్నంగా..

గార్ల: దేశభక్తిని చాటుతూ దసరా రోజు మహబూబాబాద్ జిల్లా గార్లలో జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తోంది. పండుగకు ఒకరోజు ముందు స్థానిక మసీదు సెంటర్‌లోని జెండా గద్దెకు రంగులు వేసి సిద్ధం చేస్తారు. నిజాం కాలంలో ప్రతీ దసరా రోజున నాటి తహసీల్దార్లు నెలవంక జెండాను ఎగురవేసేవారు. 1952లో గార్ల టౌన్ మున్సిపల్ చైర్మన్ మాటేడి కిషన్‌రావు కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. మెజారిటీ కౌన్సిలర్లు కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారే ఉండడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు దేశభక్తికి చిహ్నంగా పార్టీలకు అతీతంగా దసరా రోజు జాతీయజెండాను ఎగురవేయాలని తీర్పు ఇచ్చింది. దీంతో 1958 నుంచి మాటేడి కిషన్‌రావు జాతీయజెండాను ఎగురవేశారు. కొన్నేళ్ల తర్వాత గార్ల మున్సిపాలిటీని మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. నాటి నుంచి ప్రథమ పౌరుడైన సర్పంచ్ దసరా రోజు జాతీయజెండా ఆవిష్కరిస్తున్నారు. గత ఏడాది సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ మంగమ్మ జెండా ఆవిష్కరించారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీడీఓ మంగమ్మ (ఫైల్)





మైసంపల్లిలో హోమం నిర్వహిస్తున్న ప్రజలు (ఫైల్)

ఉత్సవాలకు సిద్ధం

నేడు దసరా, శమీ పూజకు ఏర్పాట్లు

- సందడిగా మారిన పల్లె, పట్నం
- జిల్లా వ్యాప్తంగా రావణాసుర దహన కార్యక్రమాలు
- జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు



స్టేడియంలో కార్యక్రమాల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు



భూపాలపల్లిలో రావణాసుర వధకు సిద్ధమైన ఏర్పాట్లు

భూపాలపల్లి అర్బన్: తొమ్మిది రోజులపాటు దేవీశరన్నవరాత్రులు నిర్వహించి పదో రోజు దసరా పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆలయాలన్నీ పండుగ శోభ సంతరించుకున్నాయి. విజయదశమి రోజున అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకరణలో పూజించనున్నారు.

నేడు ఆయుధ పూజ..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు (గురువారం) ఆయుధపూజ నిర్వహించుకోనున్నారు. రైతులు వ్యవసాయ పనిముట్లు, వాహనదారులు తమ వాహనాలకు, పోలీసులు ఆయుధాలకు ఇలా ఎవరికివారు తమ వృత్తుల్లో ఉపయోగించే పనిముట్లు, ఆయుధాలకు పూజలు చేయనున్నారు.

శమీ పూజ..

విజయదశమి రోజు శమీ దర్శనం కోసం జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. అగ్నిని శమింపజేయడానికి ఉపయోగించిన వృక్షమే శమీ వృక్షం. అటువంటి శమీ వృక్షం వద్దకు విజయదశమి నాటి సాయంత్రం చేరుకుని ప్రదక్షిణలు చేసి ఆకును తీసుకువచ్చి పెద్దవారికి ఇచ్చి వారికి చేసి ఆశీర్వాదం పాదాభినందనం తీసుకుంటారు.

పాల పిట్ట దర్శనం ప్రత్యేకం

దసరా పండుగ రోజు సాయంత్రం పాల పిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉన్నది. ఈ రోజున మూడు రకాల పక్షులను చూడడం ఆనవాయితీ. పాల పిట్టను చూస్తే పాపాలు, కర్రె పిట్టను చూస్తే కష్టాలు, గరత్మంతుడు అంటే గద్దను చూస్తే గండాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం. ఇందుకోసం శమీపూజ అనంతరం కిలో మీటర్ల దూరం అటవీ ప్రాంతంలోకి పోయి పాలపిట్టను దర్శించుకుంటారు.



వేడుకలకు సిద్ధం చేసిన దుర్గామాత ఆలయం

అంబేడ్కర్ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ, సింగరేణి, దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సుమారు 40 ఫీట్ల పొడవైన రావణాసుర బొమ్మను ఏర్పాటు చేశారు. నేడు సాయంత్రం ప్రముఖ గాయకులు, మిమిక్రీ ఆర్టిస్టులు, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరే, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను కమిషనర్ శ్రీనివాస్, సింగరేణి అధికారులు పరిశీలించారు.

కేటీకే 5వ గనిలో జమ్మి పూజలు

విజయదశమి వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కేటీకే 5వ గని ఆవరణలోని దుర్గమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్కడే ఉన్నటువంటి జమ్మి చెట్టుకు పూజలు చేసి చెట్టు ఆకును పంచిపెడుతారు. పట్టణంలో ప్రజలందరూ ఇక్కడికి చేరుకొని జమ్మి ఆకులను పంచుకుంటూ ఆశీర్వాదం తీసుకుంటారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ అభివృద్ధి అధికారి

భూపాలపల్లి రూరల్: జిల్లాకు గ్రూప్ 1 ద్వారా నియామకమైన కనపర్తి సుకీర్తి మంగళవారం జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా విధుల్లో చేరారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుకీర్తిని అభినందించారు. నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎస్సీ వసతి గృహాల్లో ఉండి విద్యాభ్యాసం చేస్తుంటారని నిబద్ధతతో సేవలందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.



కలెక్టర్ రాహుల్‌శర్మను కలిసిన ఎస్సీ అభివృద్ధి అధికారి సుకీర్తి

విజయదశమి శుభాకాంక్షలు

శ్రీ లక్ష్మీ వెంకటసాయి కాలేజి ఆఫ్ నర్సింగ
శ్రీ లక్ష్మీ వెంకటసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ

B.Sc. GNM నర్సింగ్ కోర్సులు


B.Sc. Nursing 4 సం॥లు
EAMCET 48000 Rank Below-Free Seat
Qualification: Inter, BiPC, MPHW (F)
G.N.M కోర్సు 3 సం॥లు
Qualification: (Inter Any Group), MPC, BiPC, CEC, HEC, MEC, MPHW (F)
AARVI Super Speciality Hospital మరియు గవర్నమెంట్ హాస్పిటల్ నందు క్లినికల్ ట్రైనింగ్ నిర్వహించబడును.
అడ్మిషన్లు జరుగుచున్నవి.



Cell : 70327 52676, 70134 54020

కాళేశ్వరం దేవస్థానం ఏసీ స్థాయి పెంపు?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) స్థాయి హోదాను దేవాదాయశాఖ పెంచుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆ దిశగా కసరత్తులు పూర్తిచేసినట్లు తెలిసింది. ప్రస్తుతం 6ఏ ఆలయంగా ఉన్న దేవస్థానంలో గ్రేడ్-2 ఈఓ విధులు నిర్వర్తిస్తున్నారు. 2027 జూలైలో జరుగు గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని ఏసీ(అసిస్టెంట్ కమిషనర్)స్థాయి పెంచుతున్నారని తెలిసింది. దేవస్థానం క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం మరింత మంది ఉద్యోగులు, అర్చకుల అవసరం ఉండనుంది. ఆలయ వార్షికాదాయం రూ.6కోట్లకు చేరింది. మే నెలలో జరిగిన సరస్వతినది పుష్కరాల సమయంలోనే ఏసీ స్థాయి పెంపుపైన చర్చకు వచ్చింది. మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ప్రత్యేక శ్రద్ధతో ఆలయ అభివృద్ధి కోసం స్థాయి పెంచుతున్నారని తెలిసింది. రెండు నెలల కిందటనే ఆలయ ఆదాయ, వ్యయాలు, డిపాజిట్లు, ఇతర వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపారు. 2016లో అప్పటి సీఎం కేసీఆర్, రూ.25కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన సరస్వతి నది పుష్కరాల్లో రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నారు. దీంతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం.



కాళేశ్వరాలయం

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ములుగు: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ నందిరాంనాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులం అంటూ ఫోన్ చేసి వాట్సాప్ ద్వారా వీడియో కాల్స్ చేసి బాధితులను డిజిటల్ అరెస్టు చేస్తారని తెలిపారు. అనంతరం గదికి వెళ్లి లాక్ చేసుకొనేలాగా భయభ్రాంతులకు గురి చేసి బ్యాంక్ వివరాలు తెలుసుకుని అకౌంట్‌లో డబ్బులు కాజేస్తారని వివరించారు. గుర్తింపు లేని సంస్థలు షేర్ మార్కెట్ చేయకూడదని తెలిపారు. మొబైల్‌కు వచ్చే అనవసర మెసేజ్‌లను, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల లింక్స్, ఏపీకె ఫైల్స్ క్లిక్ చేయకూడదని తెలిపారు. సైబర్ మోసాల బారిన పడితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవార్ల దర్శనం

ఘనంగా మహా పూర్ణాహుతి





శ్రీశుభానందదేవి అమ్మవారు, శ్రీసరస్వతి అమ్మవారు

కాళేశ్వరం: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతి), శ్రీసరస్వతి అమ్మవార్లు 10వ రోజు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఆలయ అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో విశేష అభిషేక పూజలు చేశారు. అమ్మవార్లను ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. రాత్రి మంత్రపుష్పం పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. భజన కార్యక్రమాలు చేశారు.

ఘనంగా మహా పూర్ణాహుతి..

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం మహర్నవమిని పురస్కరించుకొని ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి హోమం కార్యక్రమం ఆలయ ఉపప్రధాన అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ-శృతి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈఓ మహేష్, భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం గందెసిరి మధుసూదన్-రమాదేవి దంపతులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారిని ఈఓ మహేష్ శాలువాతో సన్మానించారు.



పూర్ణాహుతి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయదశమి శుభాకాంక్షలు

MEDHA RHEUMATOLOGY & RETINA EYE CARE

మేధా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
కొత్త బస్టాండ్ ప్రక్కన, బాలసముద్రం రోడ్, హనుమకొండ

అన్నిరకాల కంటి చికిత్సలు చేయబడును

ఆరోగ్యశ్రీ, EHS మరియు ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో కలవు



డా॥ అంద్రు పావని రెడ్డి
MD (Ophthalmology)
Fellowship vitreo retinal surgery (FAEI)
Consultant Retinal Surgeon

నరముల స్కానింగ్ కలదు

Cell: 9966909020, 9966909030



కేయూకు 4న సెలవు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఉద్యోగులకు ఈనెల 4న సెలవు ప్రకటించారు. ఈఏడాది జూలై 7న కేయూ స్నాతకోత్సవం సందర్భంగా 6న సెలవుదినం రోజున వర్కింగ్ డేగా ఉద్యోగులు విధులు నిర్వర్తించారు. అప్పటి జూలై 6న విధులు నిర్వర్తించినందుకు అందుకు బదులు ఈనెల 4న సెలవుదినంగా ప్రకటిస్తూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం సర్క్యూలర్‌జారీచేశారు.









పాలపిట్టా.. కనిపించవా..!



ప్రమాదంలో రాష్ట్ర పక్షి

- అంతరించిపోతున్న పక్షుల జాబితాలో రైతు నేస్తం
- దసరా పండుగ రోజు చూస్తే శుభం జరుగుతుందనే నమ్మకం

దసరా పండుగ వచ్చిందంటే ముందుగా పాలపిట్ట గుర్తుకు వస్తుంది. ఈ పండుగ పూర్తయ్యేది రంగుల పాలపిట్టను దర్శించిన తర్వాతే. దసరా రోజు నీలకంఠ పక్షిని చూడడం శుభప్రదమని, ఇది విజయానికి, అదృష్టానికి సంకేతమని నమ్ముతారు. దీనిని ఇండియన్ రోలర్, బ్లూ జే అని కూడా పిలుస్తారు. అయితే మారుతున్న పర్యావరణ పరిస్థితుల కారణంగా పాలపిట్ట మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. అంతరించి పో తున్న పక్షుల జాబితాలో దీనిని చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. ఏడాది క్రితం విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్' రిపోర్ట్‌లో సంఖ్య తగ్గిపోతున్న పక్షుల జాబితాలో వీటిని కూడా చేర్చారు. తెలంగాణతోపాటు ఏపీ, కర్నాటక, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో కూడా పాలపిట్ట ను రాష్ట్ర పక్షిగా గుర్తించారు.

గీసుకొండ

పురాణాల్లో పాలపిట్ట విశిష్టత..

పాలపిట్టను చూసిన తర్వాత రామాయణంలో శ్రీరాముడు రావణుడిపై చేసిన యుద్ధంలో విజయం సాధించాడని చెబుతారు. అలాగే, పాండవులు అరణ్యవాసం ముగించుకుని తిరిగి ఆయుధాలను తీసుకెళ్లే సందర్భంలో పాల పిట్ట ఎదురుపడిందని, ఆ తర్వాత కౌరవులతో జరిగిన యుద్ధంలో పాండవులు విజయం సాధించారని అంటారు. అందుకే పాలపిట్ట ఎదురుపడితే అన్నింటా విజయం చేకూరుతుందనే విశ్వాసం పూర్వ కాలం నుంచి కొనసాగుతోంది.

ఈ పక్షుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం..

పాలపిట్టల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం, మొబైల్ టవర్ల ద్వారా వస్తున్న రేడియేషన్, పంటల రక్షణకు పురుగుల మందులను అధికంగా వాడడమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దసరా పండుగ సందర్భంగా వీటిని కొందరు బంధించి పంజరాల్లో పెట్టి పలు నగరాలు, పట్టణాల్లో ప్రదర్శించి డబ్బులు వసూలు చేస్తున్నారు. అటవీ చట్టం షెడ్యూల్-4లో పాలపిట్ట ఉండడంతో దానిని బంధించడం, హింసించడం వంటి పనులు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులతోపాటు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 25 వేల వరకు జరిమానా విధించే వీలుంది. కాగా, ఇటీవల ఇటవీ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర వన్యప్రాణి పరిరక్షణ బోర్డు సమావేశంలో పాలపిట్ట పరిరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం కొంత ఊరట కలిగించే విషయం.

రైతునేస్తాలు ఈ పక్షులు..

పాల పిట్టలు రైతు నేస్తాలు. భారత్, థాయిలాండ్, ఇరాక్ దేశాల్లో అధికంగా కనిపిస్తారు. చిన్న కప్పలు, మిడతలు, కీచురాళ్ల వంటి జీవులను వేటాడి తింటాయి. వీటి జీవిత కాలం సుమారు 17–20 ఏళ్లు. చెట్టు తొర్రల్లో గూళ్లు పెడుతాయి. ఈ పక్షులు పంట పొలాలు, తోటలు, ఉద్యాన వనాల్లో తెగుళ్లను ఆహారంగా తీసుకుంటాయి. పంటలను నష్టపరిచే కీటకాలను, సరీసృపాలను, ఉభయ చరాలను వేటాడి తింటూ రైతులకు మేలు చేస్తాయి.

పాలపిట్ట.. పరమేశ్వరుడి స్వరూపం



పాలపిట్ట సాక్షాత్తూ పరమేశ్వరుడు, ఇంద్రుడి స్వరూపం. పది రకాల విజయాలకు విజయదశమి నాందిగా నిలుస్తుంది. దసరా రోజు పాలపిట్ట దర్శనంతో అన్ని రుగ్మతలు తొలుగుతాయి. అన్ని విజయాలకు సంకేతంగా నిలుస్తుంది. ఉత్తరం దిక్కు నుంచి పాలపిట్టను దర్శిస్తే మంచిది.

-సముద్రాల సుదర్శనాచార్యులు, వేద పండితుడు

అధిక లాభం ఆశ చూపి .. కోట్లు దోచిన ముఠా..

- ఈ ఘటనలో నలుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, పక్కన ఇతర పోలీసు అధికారులు

వరంగల్ క్రైం : పెట్టుబడికి అధిక మొత్తంలో లాభం ఇస్తామని ఆశ చూపిస్తూ ప్రజల నుంచి కోట్లా ది రూపాయలు దండుకున్న నలుగురు సభ్యుల గల ముఠాను టాస్క్ ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించి వారి నుంచి రూ.5.92 లక్షల నగదు, 684.5 గ్రాముల బంగారు నాణెలు,150 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, 4 సెల్‌ఫోన్లు, లాప్‌టాప్, రసీదు పుస్తకాలు, క్యాష్ కౌంటింగ్ మిషన్, చెక్ బుక్స్, స్టాంప్స్‌తో పాటు పొలాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

నిందితులు వీరే..

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన తెప్పాలి సైదులు, పాడిల సురేశ్ కుమార్, పాడిల శ్రీధర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన మనుబోతుల రామకృష్ణ స్నేహితులు. ఈ ముఠాలోని ప్రధాన నిందితుడు తెప్పాలి సైదులు తన భార్య నారాయణమ్మ పేరు మీద 2023లో హెబ్సిబా పేరుతో అనధికారికంగా ఓ సంస్థను ఏర్పాటు చేసి చిట్టీ వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ చిట్టీలో చేరే వారు ముందు రూ. 6 వేలు చెల్లించాలి. ఇందులో 4 వేలు తన వద్దే డిపాజిట్ చేసుకుని మిగతా రూ. 2 వేలు సభ్యులకు ఈ సంస్థపై నమ్మకం కలిగేందుకు అంతే విలువైన వస్తువులను అందజేసేవాడు. కానీ వాస్తవంగా ఈ వస్తువుల విలువ కేవలం రూ. 3 వందలు మాత్రమే ఉంటుంది. ఈ సంస్థలో ఒక సభ్యుడు ఎన్ని సభ్యత్వాలైనా పొందొచ్చు. ఇందులో చేరిన ప్రతీ సభ్యుడికి నెలకు రూ. వెయ్యి చొప్పున 20 నెలలపాటు డబ్బును తిరిగి అందజేశాడు. ప్రధాన నిందితుడు మిగతా నిందితులతో కలిసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని సుమారు 28, 493 సభ్యత్వాలను నమోదు చేసుకోవడంతోపాటు వీరి నుంచి రూ. 4 వేల చొప్పున మొత్తం రూ.11.39 కోట్లు తన వద్దనే భద్రపరుచుకున్నాడు. సభ్యులకు కేవలం రూ. 3 వందల విలువైన వస్తువులను రూ. 2 వేలకు అమ్మడం ద్వారా మరో రూ. 4. 84 మిగిల్చుకున్నాడు. ఈ క్రమంలో ఈ సంస్థపై ఫిర్యాదులు రావడంతోపాటు ముఠా సభ్యులు ప్రజల సొమ్ముతో పరారయ్యే ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ మోసం వెలుగు చూసింది. ముఠా సభ్యులు వసూలు చేసిన డబ్బును 17 బ్యాంకుల్లో జమ చేయగా రూ. 5.48 కోట్లకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగకుండా బ్యాంకు ఖాతాలను నిలిపివేసినట్లు సీపీ పేర్కొన్నారు. కాగా, ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు నర్సయ్య, మధుసూదన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్, పాలకుర్తి సీఐ జానకీరాం రెడ్డి, పాలకుర్తి, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు వంశీ కృష్ణ, దిలీప్, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమేశ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి మృతి చెందాడు. ఈ ఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఛాగల్లులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఛాగల్లుకు చెందిన కత్తెరశాల రమేశ్(44) స్టేషన్‌ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి పని ముగించుకుని స్వగ్రామం వెళ్లాడు. ఛాగల్లులో కాలినడకన జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రాజశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.



మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

నర్సంపేట రూరల్ : మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య రమేశ్ (48) కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఏం పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం తెలిపారు.

ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ల నమోదు ప్రక్రియ ప్రారంభం



నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ రఘునాథ్

కాజీపేట: కాజీపేటలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆన్‌లైన్‌లో పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ నమోదు కార్యక్రమాన్ని ఎస్‌బీఐ మేనేజర్ రఘునాథ్ ప్రారంభించారు. అక్టోబర్ 30వ తేదీ వరకు పెన్షనర్లు జీవించి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, లేనిపక్షంలో పింఛన్ ఆగిపోతుందన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.సంగమయ్య, మారపాక కట్టస్వామి, సాధినేని సూర్య నారాయణ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ కబడీ టోర్నమెంట్‌కు కేయూ జట్టు



కేయూ కబడ్డీ పురుషుల జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్ : కర్నాటక రాష్ట్రం బెల్గావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో అక్టోబర్ 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య బుధవారం తెలిపారు. జి. నాగరాజు, ఆర్. సోమేశ్వర్, జి. రమేశ్, జి. గోపి, వి. కృష్ణకుమార్. పి. ప్రణయ్, బి. సుమన్, కె. బన్నీ, సి.హెచ్. శివాజీ, బి. రేవంత్, యు. శ్రావణ్, బి. ఆజాద్, బి. కౌశిక్, సి.హెచ్. రాము జట్టులో ఉన్నారు. కోచ్‌గా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కుమారస్వామి, మేనేజర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వ్యవహరిస్తారని వెంకయ్య తెలిపారు.

రక్తదాన శిబిరం

హన్మకొండ అర్బన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా, బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్, వరంగల్ విభాగం భవిష్యనిధి ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు.











సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

- భూములు & ప్లాట్లు కొనబడును@ మహేశ్వరం, మన్‌సాన్‌పల్లి,నాగారం,దూబచర్ల, అమీర్‌పేట్, కొత్తూర్, కందుకూర్, పులిమామిడి,తుక్కుగూడ, శ్రీశైలంహైవే.9966521191 [SCA25008607]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198, 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇల్లింగ్, అమేలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టిపెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే


గిల్

ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.


రోస్టన్ ఛేజ్

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, పైర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు **సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని** అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు - పవన్ కల్యాణ్

''ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.


సుజీత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్

శశిరేఖ పరిచయం


చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.


నయనతార


సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

మాస్ జాతర ఫిక్స్


రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ-శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

నిశ్చితార్థానికి వేళాయె


అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్లు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం


ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోనెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది - అనిల్ రావిపూడి


గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్‌ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరి కాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేశ్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.